# "పూర్ ఫెలో!"

## విపంచి

"గుడ్‌నైట్! తియ్యటి స్వరంతో చెప్పింది వనజ.

"గుడ్‌నైట్ మళ్ళీ రేపు..." అని వేగంగా అడుగులేసాడు రఘు.

రఘు పార్క్ నుండి బయటపడి, పదడుగులు వేసాడో లేదో కొలీగ్ రాజేశ్వరరావ్ తగులుకున్నాడు, "ఎక్కడనుండి" అంటూ.

"పార్కు నుండి" మామూలుగా చెప్పాడు రఘు.

"ఏదీ, ఆ సెకండ్ బియ్యే వనజతోనేనా?"

రాజేశ్వరరావ్ మాటలకి ఒక్క క్షణం ఆశ్చర్యంగా చూసాడు రఘు.

ఆ ఆశ్చర్యాన్ని గమనించి పకపకా నవ్వాడు రాజేశ్వరరావ్. "ఈ లవ్‌స్టోరీలన్నీ ముందు మన దగ్గరికే వస్తాయి."

ఏమీ మాట్లాడలేదు రఘు.

ఇద్దరూ నడుస్తున్నారు.

"ఈ ఆడవాళ్ళని చచ్చినా నమ్మకూడదు గురూ!" వున్నట్లుండి అన్నాడు రాజేశ్వరరావ్.

"ఏం, ఎవరైనా నీకు మస్కా కొట్టారా?"

"అబ్బే, మస్కా కొట్టడం కాదు" నవ్వి, చెప్పాడు రాజేశ్వరరావ్ "ఈ కాలేజీ పిల్లలున్నారు చూసావ్?! ఎవడితో బడితే వాడితో లవ్ ఎఫైర్ జరిపేస్తారు.

మగవాళ్ళకి కావల్సినవేవో అందిచ్చేసి, ఆనందాన్ని అందుకొంటారు. పెళ్ళిమటుకు పెద్దవాళ్ల-యిష్టం ప్రకారం చేసుకొంటారు. పాపం, ఆ మొగుడు వెధవ తన భార్య నూటికి నూరుపాళ్ళు 'కన్నె' అని భ్రమిస్తాడు"

"నువ్వు ఏం చెబుతున్నావో నాకు అర్థం కావటం లేదు" విసుగ్గా చూసాడు రఘు.

ప్రతి గ్రంథానికి ఓ ఉపోద్ఘాతముంటుంది. నీ గ్రంథానికి కూడా..."

రాజేశ్వరరావ్ ధోరణి రఘుకి చిరాకుని, కోపాన్ని కలిగించింది.

"వనజతో ఎంతవరకూ చూసావు ఆనందాల అంచులు?" అదోలా చూసాడు రాజేశ్వరరావ్.

"డామిట్! నేను వనజని ప్రేమించాను. కామించలేదు" నొక్కి పలికాడు రఘు.

"ట్రై చెయ్, ఈజీగా 'లైన్'లో కొచ్చేస్తుంది" అనుభవం కాచి, వడపోసినవాడిలా అన్నాడు రాజేశ్వరరావ్.

"ఛ...ఎలా ఆలోచిస్తున్నావు నువు? నేను వనజని సాయంత్రం పూట ఆషామాషీ కబుర్లు చెప్పుకోవటానికో, సిన్మాలు జంటగా చూసేటందుకో ప్రేమించటం లేదు. చాలా సిన్సియర్‌గా ప్రేమిస్తున్నామని" రఘు గొంతులో ఆ సిన్సియర్‌నెస్ కొట్టొచ్చినట్లు ధ్వనిస్తోంది.

హేళనగా నవ్వాడు రాజేశ్వరరావ్. "సిన్సియర్...హ హ హ... ఇప్పటికి చాలాసార్లు విన్నానా మాటని. విని, విని విసుగు పుట్టుకొచ్చింది నాకు. ఆ ముక్కని వొదిలేయి.

ఈ వయసులో ప్రేమించేది అమ్మాయిలతో 'కాలక్షేపం' చెయ్యటానికి తప్ప, పెళ్ళి చేసుకోవటానికి కాదు.

నీ ఫ్రెండ్‌గా నేనివ్వదల్చుకుంది ఒకే ఒక్క సలహా— వనజ అంతకు ముందూ ఎంత మందితోనో తిరిగి వుంటుంది అందులో నువ్వొక నంబర్‌వి మాత్రమే.

పెళ్ళిలాంటి పెద్ద పెద్ద డైలాగ్స్ చెప్పొద్దు నాకు. జస్ట్... 'టేస్ట్' చూసి వదిలెయ్యి."

విపరీతమైన కోపానికి గురయ్యాడు రఘు. "నో డౌట్...యూ ఆర్ ఏ బ్లడీ ఇడియట్! నన్ను ప్రేమిస్తున్న అమ్మాయి పట్ల ఎంత నీచంగా మాట్లాడావు?"

"నువ్వెన్ని తిట్టినా, నేను పట్టించుకోదల్చుకోలేదు. రఘూ! నా అనుభవం మీద చెబుతున్నాను— ఈ అమ్మాయిలందరూ తమ బోయ్ ఫ్రెండ్స్ దగ్గర్నుండి ఆశించేది ఆ 'అనుభవం తప్ప' మరేది కాదు. నీ వనజ దీనికి అతీతురాలేమీ కాదు. కావాలంటే పరీక్షించుకో" చెప్పాడు రాజేశ్వరరావ్.

చిన్న అనుమానం ప్రవేశించింది రఘు మనసులోకి.

ఆలోచనలో పడ్డాడు— "వనజ కూడా అంతేనా?"

ఈ ప్రశ్నకి సమాధానం అతనికి అతి త్వరగానే లభించింది.

★ ★ ★

"వనజా! నువ్వేం అనుకోక పోతే....." సందిగ్ధంగా ఆపేసాడు రఘు.

"ఎప్పుడైనా, ఏదైనా అనుకొన్నానా?" చిలిపిగా నవ్వింది వనజ.

"ఇట్స్ ఏక్వయిట్ డిఫరెంట్ మేటర్! ఈ రోజు సాయంత్రాన్ని ఇక్కడ పార్కులో కాకుండా, నా రూమ్‌లో 'స్పెండ్ చెయ్యాలి" తట పటాయిస్తూ, చెప్పాడు రఘు.

అతనూహించినట్లుగా వనజ ఏ మాత్రం సందేహించలేదు. "పార్క్‌లో బదులు నీ రూమ్‌లో... అంతేగా! చిన్న మార్పు. నాకే అభ్యంతరం లేదు" నవ్వుతూ అంగీకరించింది.

అనుమానంగా చూసాడామెకేసి రఘు. "వనజ కూడా... కూడా..."

అబ్బా రఘూ! ఏమిటంతగా ఆలోచనలో పడిపోయావు?"

వనజ మాటలకి ఆమె వైపు తిరిగాడు రఘు. "ఏంలేదు!" నవ్వటానికి చేసిన ప్రయత్నంలో సక్సెస్ కాలేక పోయాడు.

మన విషయం మీ యింట్లో వాళ్ళకి వ్రాసావా?" అడిగింది వనజ.

"వ్రాస్తాను" గొణిగాడు.

మా యింటో వాళ్ళకింకా తెలీదు మన విషయం! వాళ్ళెన్ని అభ్యంతరాలు చెప్పినప్పటికీ, నేను నిన్ను పెళ్ళి చేసుకోవటం ఖాయం! నువ్వు నా ప్రాణం రఘూ!!!"

వనజ గొంతులో క్షణం...క్షణకాలం పాటు ధ్వనించిన మాధుర్యానికి విచలితు డయ్యాడు రఘు.

('వనజ ఈజ్ ఏ గుడ్ గర్ల్'— మనసులో అనుకున్నాడు.)

ఇంతలో వారిద్దరూ రఘు రూమ్ చేరుకొన్నారు.

తలుపు తెరచి, ఆ చీకటి గదిలో 'లైట్' వేసాడు రఘు.

ఆ విద్యుద్దీప కాంతిలో కన్పించిన గదిని చూసి, పకపక నవ్వింది వనజ. "అచ్చం బ్రహ్మచారి రూమ్ అన్పించుకొంది!" అన్నది చెల్లాచెదురుగా వున్న సామానుకేసి చూస్తూ


"కూర్చో!" ఆ గదిలోవున్న ఏకైక మడత మంచాన్ని 'ఆఫర్' చేసాడు.

"కుర్చీలేదా?" మంచంమీద కూర్చుంటూ, యథాలాపంగా అడిగింది వనజ.

"లేదు... చిన్నసైజు రిపేర్" చెప్పి, ఓ సెకనాగి అడిగాడు రఘు "మంచినీళ్ళు తీసుకొంటావా?"

"నో!" ముక్తసరిగా చెప్పి, గదిని పరిశీలించటంలో నిమగ్నురాలై పోయింది

కొద్దిసేపటి తర్వాత గమనించింది వనజ— రఘు నిలబడి వుండటం




''అదేమిటి రఘూ! అలా నిలబడిపోయా వు? నీ గదిలో నువ్వే తటపటాయిస్తున్నావా! ఫర్లేదు నా ప్రక్కన కూర్చోవచ్చు'' అతడి చేయిపట్టి, లాగింది వనజ.

తడబడుతూ, ఆమె ప్రక్కన కూర్చున్నాడు రఘు.

వనజ నవ్వుతూ, ఏదో మాట్లాడుతోంది.

ఆ శబ్దాలు రఘుకి విన్పించటం మానేసి, చాలా సేపయ్యింది.

అతనికికన్పిస్తుంది, విన్పిస్తుంది ఒక్కటే– వనజ ముగ్ధమోహన రూపం.

వేగంగా ప్రవహిస్తున్న రక్తం...

మెరుస్తున్న వనజ అందమైన కళ్ళు...

ఏదో వూహించి, ఆశపడుతున్న హృదయం ఉద్వేగంతో కొట్టుకుంటున్న గుండె...

వనజ ఎర్రని బుగ్గలు. యాపిల్ పళ్ళని గుర్తుకు తెప్పిస్తూ...

నవ్వుతుంటే, గుండెల మీద అటూ–యిటూ కదులుతున్న సన్నటి గొలుసు...

అనుభవం... అవకాశం ... అవకాశం ... అనుభవం...

నవ్వే పలు వరుస...

కోరికతో ఎరుపెక్కుతున్న కనులు...

రాజేశ్వరరావ్ సలహా...

వనజ మెడవంపు...

శీలానికో పరీక్ష...

కోరిక... కోరిక...

దహించుకుపోతున్నాడు రఘు.

చటుక్కున వనజ మీదకు వాలి, ఆమె ఎర్రటి పెదాలని చుంబించాడు.

తెల్లబోయి చూసింది వనజ - ఓ క్షణం మాత్రమే.

తన నడుముని చుట్టుకుపోతున్న రఘు చేతులని విసురుగా వదిలించుకొని, వడివడిగా నడుస్తూ, బయటికి వెళ్ళిపోయింది వనజ.

కొద్ది సేపటి వరకూ నిశ్శబ్దం—ఆ గదిలో...

ఆ తర్వాత చిన్నగా అరిచాడు రఘు— నా వనజ అందరిలాంటి ఆడపిల్ల కాదు!''

★ ★ ★

''చూసావా రాజేశ్వరరావ్? నీ అంచనా ఎంత దారుణంగా తప్పిందో! నా వీనస్ వనజని సాధారణపు అమ్మాయిల్లా జమ కట్టేస్తావా!'' ఆనందంగా అంటున్నాడు రఘు రాజేశ్వరరావ్‌తో, ఆ మరునటి రోజు మధ్యాహ్నం లంచవర్లో—

''పెళ్ళయ్యే వరకూ ప్రేమించిన వ్యక్తితో కూడా చనువు తీసుకోవటానికి యిష్టపడదు నా వనజ. ఆమెని శంకిస్తావా?''

రఘు మాటలకి ఏమీ మాట్లాడలేదు రాజేశ్వరరావ్.

ఆ రోజు సాయంత్రం ఆఫీస్ నుండి బయటికొస్తున్నప్పుడు చెప్పాడు. ''సారీ రఘూ, నేను పూర్తిగా పొరబడ్డాను!''


★ ★ ★

పార్కులో అరగంటనుండి అసహనంగా వెయిట్ చేస్తున్నాడు రఘు—ఐదైనా యింకా రాని వనజ కోసం.

ఆ రోజే కాదు— ఇంకో రెండు, మూడు సాయంత్రాలు కూడా రఘు నిరీక్షించాడు.

కాని వనజ రాలేదు.

నాలుగోరోజు మధ్యాహ్నం రఘు ఆఫీస్




అడ్రస్‌కి ఓ కవర్ వచ్చింది.

ఆ కవర్ మీది వ్రాత వనజది!

ఆతృతతో ఆ కవర్‌ని ఓపెన్ చేసాడు రఘు. చదువుతుంటే రక్తం లేనివాడిలా తెల్లగా పాలిపోయింది అతని మొహం.

అందులో నాలుగే నాలుగు వాక్యాలున్నాయి.

''మిస్టర్ రఘూ !

మీరు మంచివారని, అందరిలాంటివారు కాదని మిమ్మల్ని మనసారా ప్రేమించాను. ఆ రోజు రూమ్‌లో మీ ప్రవర్తన నాకంతా చెప్పింది.

పెళ్ళికాని ఆడపిల్లల్ని ప్రేమ పేరుతో వంచించి, అనుభవించాలని ఆశపడే అప్టరాల్ ఒక మగ పురుగువేనని నా కర్థమైంది.

నీలాంటి 'లూజ్ క్యారక్టర్' మనిషిని నేను పెళ్ళి చేసుకోలేను. ప్రేమించలేను.

గుడ్‌బై ! ఇక నన్ను కలవటానికి ప్రయత్నించకు.

— వనజ.''

★ ★ ★

ఆ తర్వాత కొద్ది రోజులకే రఘు వనజ పెళ్ళి శుభలేఖ అందుకొన్నాడు— కాని ఆమె నుండి కాదు! వనజకి భర్త కాబోతున్న పెళ్ళి కొడుకు రాజేశ్వరరావ్ నుండి.

''వనజ— రాజేశ్వరావ్'' ప్రక్క ప్రక్కనున్న ఆ పేర్లని చూస్తూ, షాక్‌తో అలాగే నిలబడి పోయాడు రఘు. ''ఏమిటిది?'' అస్పష్టంగా గొణిగాడు.

బదులుగా నవ్వి, పూరుకొన్నాడు రాజేశ్వరరావ్.

పైకి అనక పోయినా మనసులో మాత్రం అను కొన్నాడు. ''సారీ రఘూ! మా వివాహానికి వనజ తల్లిదండ్రుల అనుమతి ఎప్పుడో లభించింది. కాని వనజే నిన్ను ప్రేమిస్తుంది. నాకు వనజ తత్వం బాగా తెలుసు. అందుకే నిన్నిలా రెచ్చగొట్టి, వనజను నీకు దూరంచేసి, నాకు దగ్గర చేసుకున్నాను. నీతో తిరిగి నంత మాత్రాన వనజకు జరిగిన నష్టమేమీ లేదు ఇక మా జీవితం ఆనందంగా గడిచి పోతుంది.''

□




ఆడపిల్లలు లేదా మొగపిల్లలు
ఇద్దరు మాత్రమే చాలు

davp 84/412